కవర్ స్టోరీ



# తలవంచని తెలంగాణ

తెలంగాణ వస్తే చిమ్మచీకటే అని చూపిన చూపుడువేలు ఏ వెలుతురులో దాక్కున్నది?
నిషేధిత పదమైన తెలంగాణ నిలువెత్తు పటం ఎట్లా అయ్యింది ?
'ఒక్క రూపాయి కూడా ఇవ్వను. నీ దిక్కున్నచోట చెప్పకో' అని ఈసడించిన గొంతు ఏ పాతాళంలోకి జారుకున్నట్టు?
'తెలంగాణ వస్తే మావోయిస్టులే రాజ్యమేలుతారు' అని సిద్ధాంతీకరించినవాళ్లు ఏ కీకారణ్యంలో తలదాచుకున్నట్టు?
'మీరు కేవలం ఆందోళనకారులు. మీకు పాలన చేతకాదు' అని తీర్మానించినవాళ్లు ఏలుతున్న రాజ్యంలో పాలన ఎలా ఉంది?
'మీకు భాష రాదు.. మాట్లాడే విధానం తెలియదు' అని వెక్కిరించిన భాషా పండితులు ఏ చెట్టుకింద పాఠాలు చెప్తున్నట్టు ?

★ ★ ★

తెలంగాణ అంటే సరిగ్గా పదేండ్ల క్రితం ఇవే సూత్రీకరణలు.. ఇవే సిద్ధాంతాలు..
కానీ, తెలంగాణ... తనకు తాను లేచి నిలబడి అడుగులు వేయటం మొదలయ్యాక తడబడనే లేదు. ఎత్తిన తల దించనే లేదు..
అంతా పచ్చి మిరపకాయ కోసినట్టే.. పుల్లు నాటు. ఘాటు తొక్కునూరినట్టే ఊర నాటు.. అని విరామమెరుగక చిందేస్తున్నది.
అద్గదీ తెలంగాణ అంటే... వందేండ్ల చరిత్ర ఉన్న తెలుగు వెండితెరకు ఆస్కార్‌ను తెచ్చిన భాష తెలంగాణ..
తెలుగుభాషకు ప్రాచీన హోదా కల్పించిన తీవి తెలంగాణ సొంతం...

★ ★ ★

తెలంగాణ భాషలోనే రిథమున్నది. జీవనమధువున్నది. సంబురమనిపిస్తే ధూం..ధాం..చేస్తది. కోపమొస్తే దుమ్ము రేపుతది.
తెలంగాణ ఏర్పడి పదేండ్లే అయినా.. వెయ్యేండ్ల చరిత్రను తిరగరాసింది.
మిషన్ కాకతీయ చెరువై మెరిసింది. పల్లె పసిడిముల్లెగా మురిసింది. పట్నం ప్రగతి చక్రమై కుమ్మేసింది. గాయాల నేపథ్యంతో
మొదలైన జానపదాల వీరగాథల జయపతాకను ఎగురవేసి కొదమసింహమై గర్జించింది తెలంగాణ.
తెలంగాణ రాష్ట్రం పదేండ్ల పండుగను పురస్కరించుకొని నమస్తే తెలంగాణ అందిస్తున్న ప్రత్యేక కథనం ఇదీ...

...✍ నూర శ్రీనివాస్